# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 257 | మంగళవారం 2 ఏప్రిల్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# రివర్స్ రాజకీయం!?



చేరికలు కాంగ్రెస్‌కు బలమా... బలహీనమా...

గతంలో కేసీఆర్... ఇప్పుడు కాంగ్రెస్ అలా పక్క పార్టీల నేతలకు తమల పార్టీలో చేర్చుకునే ప్రయత్నం

కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని రెండు సార్లు శాసనసభాపక్షాల్ని విలీనం చేసుకున్నారు.

సిట్టింగ్ ఎంపీల నుంచి మొదలుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యులు తమను తాము రక్షించుకునేందుకు మారుతున్న పార్టీల నేతలు

తెలంగాణలో ఇప్పుడంతా రివర్స్ రాజకీయం నడుస్తోంది. భూమి గుండ్రంగా ఉందన్నట్లుగా గతంలోకేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని, నేతల్ని ఎలా పార్టీలో చేర్చుకున్నారో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నేతల్ని అలా చేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతిపక్షమే లేకుండా చేయాలనుకున్నారు కేసీఆర్. సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని రెండు సార్లు శాసనసభాపక్షాల్ని విలీనం చేసుకున్నారు. అయినా కాంగ్రెస్ బేషుగ్గా ఉంది. ఇప్పుడు అధికారంలోకి కూడా వచ్చింది. అంటే కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ తప్పని తేలిపోయింది. అయినా కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ అదే తప్పు ఎందుకు చేస్తోంది. కొత్తగా చేరే వాళ్లతో ఆ పార్టీకి లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ బీఆర్ఎస్ ఎంత ఉన్నత స్థితిని చూసిందో ఇప్పుడు అంతటి హీన స్థితిని ఎదుర్కొంటోంది. అధికారం రాగానే వచ్చిన నేతలంతా అధికారం పోగానే మళ్లీ అధికార పార్టీ వైపు వెళ్తున్నారు.

-3లో



## అకౌంటెంట్‌ను సీఎండీ చేసిన ఘనత కేసీఆర్‌దే

- కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలే
- కేసీఆర్ పాలనలో తెలంగాణలో వాటర్ మేనేజ్‌మెంట్ లేదు
- చలికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది
- మా పాలనలో ఇంకా వర్షాకాలం రానే రాలేదు
- కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ అని డబ్బా కొట్టారు
- నీళ్లు ఉంటే ఇప్పటికే అది మొత్తం కూలిపోయేది

ఢిల్లీ

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో వాటర్ మేనేజ్‌మెంట్ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎండిన పంటలను పరిశీలించిన తర్వాత సూర్యాపేటలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై భట్టి సోమవారం ఢిల్లీలో స్పందించారు. ‘చలికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. మా పాలనలో ఇంకా వర్షాకాలం రానే రాలేదు. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ అని డబ్బా కొట్టారు అది కూడా కూలిపోయింది. నీళ్లు ఉంటే ఇప్పటికే అది మొత్తం కూలిపోయేది. కేసీఆర్ హయాం లో అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. -మిగతా3లో

## పార్లమెంట్ ఎన్నికలపై స్పెషల్ ఫోకస్



- కాకరేపుతున్న ఆ నాలుగు స్థానాలు.. ఆ స్థానంలో అభ్యర్థి మార్పు!
- పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడమే లక్ష్యంగా టీ.కాంగ్రెస్ దూకుడు
- దశలవారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ కనీసం 14 స్థానాల్లోనైనా జెండా ఎగరేయాలని వ్యూహాలు
- ఈ నాలుగు స్థానాల్లోనూ పోటీ ఎక్కువగా ఉండడంతో అధిష్టానంతో చర్చించి పేర్లు ఖరారు చేసేందుకు టీ.కాంగ్రెస్ కసరత్తు
- తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించింది టీ.కాంగ్రెస్.
- మంత్రుల కుటుంబాలను కాదని వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కు టికెట్ ఇచ్చే అవకాశం

ఢిల్లీ:

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తెలంగాణలో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను దశల వారీగా ప్రకటిస్తున్నాయి. బీఆర్ ఎస్, బీజేపీ పార్టీలు 17 స్థానాలకు అభ్యర్థులను డిక్లేర్ చేయగా.. అధికార కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడమే లక్ష్యంగా టీ.కాంగ్రెస్ దూకుడు పెంచుతోంది. దశలవారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ కనీసం 14 స్థానాల్లోనైనా జెండా ఎగరేయాలని వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 8 జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్.. తెలంగాణకు సంబంధించి 13 స్థానాల్లో క్యాండేట్లను ప్రకటించింది. మరో నాలుగు స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన పెండింగ్ పడుతూ వస్తోంది. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నాలుగు స్థానాల్లోనూ పోటీ ఎక్కువగా ఉండడంతో అధిష్టానంతో చర్చించి పేర్లు ఖరారు చేసేందుకు టీ.కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే.. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించింది టీ.కాంగ్రెస్. -మిగతా3లో

## రాహుల్ వ్యాఖ్యలపై కఠిన చర్యలు




- మోదీ సర్కార్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- కాంగ్రెస్ ఎంపీపై కఠిన చర్యలకు కేంద్ర మంత్రి డిమాండ్
- రాహుల్‌కు కేవలం నోటీసులు జారీ చేస్తే సరిపోదు
- ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఇండియా విపక్ష కూటమి చీలిపోతోంది

## ట్యాపింగ్ కేసు ఎవ్వర్నీ వదలం

- కూతురు ఒక కేసులో ఇరుక్కుపోయింది
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరు ఇరుకుతారో అని బీఆర్ఎస్ వాళ్లకు భయం పట్టుకుంది
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదు
- కేసీఆర్ స్పీచ్‌పై మంత్రి ఉత్తమ్ రియాక్షన్ ఇదే...
- కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే
- ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారు
- ఒడిపోవడమే కాదు, పార్టీ మిగలదు అనే భయం కేసీఆర్‌లో మొదలైంది
- పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదు




హైదరాబాద్

తెలంగాణలో హాట్ టాపిక్ గా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ చేసిన వాళ్లను వదిలేదే లేదని, ట్యాపింగ్ వెనుక ఎంత పెద్ద నాయకులు ఉన్నా శిక్ష పడుతుందని ఉత్తమ్ హెచ్చరించారు. తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని అన్నారు. కూతురు ఒక కేసులో ఇరుక్కుపోయింది. గొర్రెల స్కాంలో కొందరు ఇరుక్కుపోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరు ఇరుకుతారో -మిగతా3లో

## నూతన ఆర్థిక సంవత్సరం 2024-25 షురూ..

- అమల్లోకి కొత్త నిబంధనలు
- కొత్త చెల్లింపుదార్లకు డీఫాల్ట్‌గా వర్తించనున్న నూతన పన్ను విధానం
- కీలకమైన 800 రకాల ఔషధాల ధరలు స్వల్పంగా పెరుగుదల
- మార్చి 31 నాటికి కేవైసీ అప్‌డేట్ చేయకుంటే రెట్టింపు టోల్ ఛార్జీలకు అవకాశం



# ఎన్నికల సర్వేల్లో రిషి సునాక్‌కు షాక్

**లండన్:** బ్రిటన్‌లో ఇప్పటికిప్పుడు సాధారణ ఎన్నికలు జరిగితే భారత సంతతికి చెందిన రిషి సునాక్‌తోపాటు ఆయన కేబినెట్‌లోని సగానికి పైగా మంత్రులకు పరాజయం తప్పదని ముందస్తు సర్వేలో తేలింది. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 100 పార్లమెంట్ స్థానాలు కూడా దక్కడం గగనమేనని, అదే సమయంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ 468 సీట్లు గెలుచుకుని, 286 సీట్ల మెజారిటీ సాధిస్తుందని కూడా అంచనా వేసింది. బెస్ట్ ఫర్ బ్రిటన్ తరఫున సర్వేషన్ సంస్థ 15,029 మందితో తాజాగా సర్వే జరిపింది. ఇందులో పాల్గొన్న వారిలో 45 శాతం మంది ప్రతిపక్ష లేబర్ పార్టీకే ఓటేశారు. పాయింట్ల వారీగా చూస్తే అధికార కన్జర్వేటివ్ పార్టీ కంటే లేబర్ పార్టీ 19 పాయింట్లు ముందంజలో ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో చేపట్టిన పోలింగ్‌తో పోలిస్తే ఇది మూడు పాయింట్లు ఎక్కువ. కన్జర్వేటివ్ పార్టీ 100 లోపే సీట్లు గెలుచుకోవడం, అంటే



250 ఎంపీ స్థానాలను కోల్పోవడం ఇటీవలి కాలంలో ఇదే

మొదటిసారవుతుందని నిర్వాహకులు విశ్లేషిస్తున్నారు. సొంత సీటు రిచ్‌మండ్ అండ్ నార్త్‌అల్లెర్టన్‌లో ప్రధాని రిషి సునాక్‌కు లేబర్ పార్టీ కంటే 2.4 శాతం మాత్రమే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్‌లో ఎటు వైపూ మొగ్గు చూపని 15 శాతం మంది ఓట్లను పరిగణనలోకి తీసుకోలేదని 'సర్వేషన్'తెలిపింది. కన్జర్వేటివ్ పార్టీ పరిస్థితి మున్ముందు మరింత దారుణంగా ఉంటుందని ఓ విశ్లేషకుడు అన్నారు. ఇలా ఉండగా, మే 2వ తేదీన స్థానిక కౌన్సిళ్లు, మేయర్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ పేలవమైన ఫలితాలను సాధించిన పక్షంలో ప్రధాని రిషి సునాక్‌పై సొంత పార్టీలోనే తిరుగుబాటు రావడం ఖాయమని కూడా అంటున్నారు.

# నూతన ఆర్థిక సంవత్సరం 2024-25 షురూ


నేటి నుంచి (ఏప్రిల్ 1) నూతన ఆర్థిక సంవత్సరం 2024-25 ఆరంభమైంది. నెల ప్రారంభం కూడా కావడంతో దేశ సగటు వాసులను ప్రభావితం చూపే పన్ను సంబంధిత, డబ్బుతో ముడిపడిన పలు నూతన నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.

1. నేటి నుంచి నూతన పన్ను విధానం కొత్త చెల్లింపుదార్లకు డీఫాల్ట్‌గా వర్తిస్తుంది. చెల్లింపుదారులు పాత విధానాన్ని ఎంచుకోకపోతే ఆటోమేటిక్‌గా కొత్త విధానం వర్తిస్తుంది. నూతన పన్ను విధానంలో నిర్దేశిత పన్ను మినహాయింపు ఉంటుంది. కానీ పాత పన్నుల విధానం మాదిరిగా మినహాయింపులు ఏమీ వర్తించవు.
2. మార్చి 31 నాటికి కేవైసీని ధ్రువీకరించని స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు నేటి నుంచి పెట్టుబడులు, నగదు ఉపసంహరణలతో పాటు ఇతర లావాదేవీలను నిర్వహించడం సాధ్యపడదు. అయితే ఇప్పటికే ఉన్న పెట్టుబడుల విషయంలో కేవైసీ తప్పనిసరి కాదు.
3. లింక్డ్, నాన్-లింక్డ్ సంబంధిత బీమా పాలసీలపై ఖరారైన సరెండర్ ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఇటీవలే ఛార్జీలను నిర్ణయించింది. పాలసీదారులు తమ బీమా పాలసీని సరెండర్ చేసిన నాటికి చెల్లించిన ప్రీమియంలలో 30-90 శాతం మొత్తం పొందవచ్చు.
4. దేశ జనాభాలో ఎక్కువ మందికి అవసరమైన ఔషధాల ధరలు నేటి నుంచి అతి స్వల్పంగా పెరగనున్నాయి. ఎన్ఎల్ఈఎం (నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్) చేర్చిన దాదాపు 800 రకాల మందుల ధరలు 0.0055 శాతం మేర పెగనున్నాయి. ఈ మేరకు కేంద్రం అనుమతినిచ్చింది.



5. పాలసీదారులందరూ ఏప్రిల్ 1 (నేటి) నుంచి తమ పాలసీలను డిజిటలైజ్డ్‌గా మార్చుకోవాల్సి ఉంటుంది. అంటే ప్రతి పాలసీదారుడు తన పాలసీని ఈ-ఇన్సూరెన్స్‌గా మార్చుకోవాలి. పాలసీలు అన్నింటిని ఎలక్ట్రానిక్ రూపంలో జారీ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ (రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇటీవలే ప్రకటన చేసింది. ఈ నిబంధన లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ సహా అన్ని కేటగిరీల బీమాలకు వర్తిస్తుంది.
6. ఫాస్టాగ్‌లకు సంబంధించి కేవైసీని పూర్తి చేయని వాహనదారులు నేటి నుంచి రెట్టింపు ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్‌ల కేవైసీని పూర్తి చేసేందుకు తుది గడువు మార్చి 31గా ఉంది. ఆదివారంతో ఈ గడువు ముగిసిపోయింది. దీంతో కేవైసీ సమాచారాన్ని అప్‌డేట్ చేయని వ్యక్తులు సేవల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల వద్ద రెట్టింపు ఛార్జీలు చెల్లించే అవకాశం ఉంటుంది.

## జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో పూజలకు సుప్రీంకోర్టు అనుమతి!



**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం(ఏప్రిల్ 1) కీలక తీర్పు ఇచ్చింది. మసీదు దక్షిణం వైపు ఉన్న సెల్లార్‌లో హిందువులు ప్రార్థనలకు అనుమతి నిరాకరించాలన్న మసీదు కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే మసీదు ఆవరణలో హిందువులు పూజలు చేసుకునే అంశంలో మాత్రం ప్రస్తుతానికి యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది. మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసేందుకు అనుమతి నిరాకరించాలన్న మసీదు కమిటీ పిటిషన్‌ను ఫైనల్‌గా జులైలో విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కాగా,మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసుకోవచ్చని గతంలో వారణాసి జిల్లా కోర్టు తీర్పునివ్వగా ఈ తీర్పును అలహాబాద్ హైకోర్టు కూడా ధృవీకరించింది. అయితే, హిందువులు చేసే పూజలు మసీదు దక్షిణ వైపు ఉన్న సెల్లార్ ప్రాంతానికే పరిమితం కావాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, మసీదు ఆవరణలో హిందువులు పూజలు చేసుకునే అంశంలో మాత్రం ప్రస్తుతానికి యథాతథ స్థితిని కొనసాగించాలని కోర్టు వెల్లడించింది. ఇక మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసేందుకు అనుమతి నిరాకరించాలన్న మసీదు కమిటీ పిటిషన్‌ను ఫైనల్‌గా జులైలో విచారిస్తామని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా, మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసుకోవచ్చని గతంలో వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును అలహాబాద్ హైకోర్టు సైతం ధ్రువీకరించిన విషయం తెలిసిందే

## సునీతా కేజ్రీవాల్ 'నియంతృత్వం' విమర్శలపై బీజేపీ కౌంటర్

**న్యూఢిల్లీ:** లిక్కర్ స్కామ్ మనీలాండరింగ్ కేసులో అరెస్టైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కి జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు.. తీహార్ జైలుకు తరలించాలని ఆదేశించింది. కోర్టు ఆయనకు ఏప్రిల్ 15వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అలాగే తీహార్ జైలుకు తరలించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'సీఎం కేజ్రీవాల్‌ను జైలుకు ఎందుకు పంపారు?. వారికి( బీజేపీ) ఒక్కటే లక్ష్యం ఉంది..లోక్‌సభ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌లో జైలులోనే ఉంచటం. దేశ ప్రజలు ఇలాంటి నియంతృత్వానికి గట్టి సమాధానం చెబుతారు' అని సునీతా కేజ్రీవాల్ అన్నారు. సునీతా కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ కౌంటర్ ఇచ్చింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి సునీతా కేజ్రీవాల్‌ను రబ్రీదేవీతో పోల్చారు. 'రబ్రీదేవి సిద్ధమవుతోంది. గత వారం, పది రోజుల్లో ఇప్పటికే మూడు, నాలుగు సార్లు చెప్పాను. రబ్రీ త్వరలో మనముందుకు వస్తుంది. అంటే నేను అనేది..సునీతా కేజ్రీవాల్ సీఎంగా రాబోతుంది. అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఇద్దరు నేతలు మనీష్



సిసోడియా, సంజయ్ సింగ్‌తో కేబినెట్ చర్చలు జరుపుతున్నారు. ఏ ప్రభుత్వమైనా జైలు నుంచి నడపుతారా? ఇక్కడి ప్రభుత్వంలో మాత్రం ముగ్గురు మంత్రులు జైలులో ఉన్నారు. వారు అక్కడే కేబినెట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు' అని హర్దీప్ సింగ్ పూరి ఎద్దేవా చేశారు. ఇక.. అవినీతి కేసులో ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ జైలు వెళ్లినప్పుడు ఆయన భార్య రబ్రీదేవి సీఎం అయిన విషయం తెలిసిందే.

# తీహార్ జైలుకు కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టైన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టులో మరో షాక్ తగిలింది. ఆయన్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించేందుకు కోర్టు ఓకే చెప్పింది. దీంతో ఆయన్ని కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాల మంరకు 15 రోజుల పాటు తిహార్ జైలులో



ఉండబోతున్నారు. ఇప్పటికే ఇదే కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అక్కడే ఉన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం కూడా అదే జైల్లో ఉన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో అరవింద్ కేజ్రీవాల్ మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు మార్చి 21 రాత్రి అరెస్టు చేశారు. 22న కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఈడీ కస్టడీకి ఇవ్వడంతో ఏడు రోజుల పాటు విచారించారు. విచారణ గడువు పూర్తి కావడంతో ఇవాళ కోర్టులో హాజరుపరిచారు. 28న విచారణ గడువు ముగిసినప్పటికీ కోర్టుకు సెలవులు కారణంగా ఇవాళ హాజరుపరిచారు. కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ... విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని రిక్వస్ట్ పెట్టారు.కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ... విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని రిక్వస్ట్ పెట్టారు.ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రధాన సూత్రధారిగా ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత, మాజీ డిప్యూటీ సీఎంలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ జైలులో ఉన్నారు. ఈ స్కామ్‌లోని డబ్బులనే ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ఎన్నికల్లో వినియోగించినట్టు చెబుతోంది. దర్యాప్తు సంస్థ చేస్తున్నఆరోపణలు కేజ్రీవాల్ సహా ఆప్ నేతలు ఖండిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకుండా ఉండేందుకే కేంద్రం కక్ష పూరితంగా కేసులు పెట్టి వేధిస్తోందని ?ంటున్నారు.

మెడిసిన్స్, డైట్ ప్రకారం ఆహారం అందించాలని విజ్ఞప్తి

జైల్లో చదివేందుకు తనకు మూడు పుస్తకాలు కావాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోర్టును కోరారు. మద్యం అంశానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ కేజ్రీవాల్‌ని ఈ నెల 21న అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ఈడీ కస్టడీకి అప్పగించింది. నేడు కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం ఆయనకు 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ క్రమంలో ఆయన కోర్టుకు కొన్ని అభ్యర్థనలు చేశారు. ఈ మేరకు ఆయన తరఫు న్యాయవాది దరఖాస్తు సమర్పించారు. తనకు జైల్లో చదివేందుకు రామాయణం, భగవద్గీత కావాలని, అలాగే జర్నలిస్ట్ నీరజా చౌదరి రాసిన 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకం కావాలని, వాటిని అందుబాటులో ఉంచాలని కోరారు. ఒక బల్ల, కుర్చీ, మెడిసిన్స్, డైట్ ప్రకారం ఆహారం అందించాలని కోరారు. ఇప్పటికే ధరిస్తోన్న లాకెట్‌ను అనుమతించాలని కోరారు.

## జేఈఈ అడ్మిషన్ కార్డు రిలీజ్

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా ఉన్ ప్రతిష్టాత్మక ఎన్ఐటీలు, ఇతర ప్రఖ్యాత ఇంజనీరింగ్ సంస్థల్లో బీటెక్ , బీఆర్క్, బీఈ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ మెయిన్స్ 2024 సెషన్ 2 అడ్మిట్ కార్డులు సోమవారం (ఏప్రిల్ 1న) విడుదలయ్యాయి. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటన విడుదల చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జేఈఈ అధికారిక వెబ్‌సైట్ నుంచి కార్డులు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, కోర్సు, సెక్యూరిటీ పిన్ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా జేఈఈ మెయిన్ తుది విడత పరీక్షలు ఏప్రిల్ 4, 5, 6, 8, 9, 12 తేదీల్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి జేఈఈ మెయిన్ స్కోర్ కీలకం. జేఈఈ మెయిన్ పరీక్షను ఏటా రెండు దఫాలుగా నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. రెండు సార్లు పరీక్ష రాసిన వారికి బెస్ట్ స్కో?ర్ ఎందులో వస్తే ఆ మార్కులను ప్రామాణికంగా చేసుకుని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అనుమతిస్తారు. ఇప్పటికే అభ్యర్థులు ఫుల్ ప్రిపరేషన్‌లో ఉన్నారు. ఏప్రిల్ 4 నుంచి ఆరు రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి.

**ఐబీపీఎస్ పీఓ తుది ఫలితాలు విడుదల**

ఐబీపీఎస్ నిర్వహించిన ప్రొబెషనరీ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల రాత పరీక్షకు సంబంధించిన తుది ఫలితాలు సోమవారం (ఏప్రిల్ 1) విడుదలయ్యాయి. మెయిన్స్ లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా తుది ర్యాంకును నిర్ణయిస్తారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. మొత్తం 3,049 పోస్టులకు గానూ ఈ నియామక ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఐబీపీఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

## రాహుల్ వ్యాఖ్యలుపై కఠిన చర్యలు




**న్యూఢిల్లీ :** మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తోసిపుచ్చారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన రాహుల్‌పై కఠిన చర్యలు చేపట్టాలని హర్దీప్ సింగ్ సోమవారం ఈసీకి విజ్ఞప్తి చేశారు. రాహుల్‌కు కేవలం నోటీసులు జారీ చేస్తే సరిపోదని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీ రాంలీలా మైదానంలో జరిగిన విపక్ష ఇండియా కూటమి ర్యాలీలో రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరకర అంశాలను ప్రస్తావించారని అన్నారు.

బీజేపీకి ఈ ఎన్నికలు మ్యాచ్ ఫిక్సింగ్ అని, ఈసీలో ప్రభుత్వం సొంత మనుషులున్నారని, మోదీ ఈవీఎంలు లేకుండా గెలవలేరని పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు. తాము ఈ విషయాలన్నింటినీ ఈసీ దృష్టికి తీసుకువచ్చామని, ఈ ఆరోపణలను ఈసీ తోసిపుచ్చిందని, వీటన్నింటికి సరైన ఆధారాలు లేవని పేర్కొందని చెప్పారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర పాలకులు లాగేసుకున్నారని రాహుల్ ఆరోపించారని, కాషాయ పార్టీకి 400 సీట్లు దక్కితే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ఓ బీజేపీ కార్యకర్త చెప్పారని రాహుల్ అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అలా అని ఏ కార్యకర్త చెప్పాడో తమకు తెలియదని అన్నారు. ఇండియా విపక్ష కూటమి చీలిపోతోందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి కేవలం నోటీసు జారీ చేస్తే సరిపోదని, ఆయనపై కఠిన చర్యలు చేపట్టాలని హర్దీప్ పూరి డిమాండ్ చేశారు.

## మార్చిలో రికార్డు స్థాయి జీఎస్టీ వసూళ్లు



గత నెల మార్చిలో రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్ల జీఎస్టీ ఆదాయం వసూలైంది. ఏడాది ప్రాతిపదికన 11.5 శాతం వృద్ధి నమోదయిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఇదే రెండవ అత్యధిక స్థాయి వసూలు అని తెలిపింది. దేశీయంగా వ్యాపార, వాణిజ్య లావాదేవీలు 17.6 శాతం మేర పెరగడం ఈ స్థాయి వసూళ్లకు దోహదపడిందని పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థలో దృఢమైన ఆదాయానికి ఈ వసూళ్లే ప్రతిబింబమని వ్యాఖ్యానించింది. ఇక సంవత్సరం ఏప్రిల్ 2023-మార్చి 2024 కాలంలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.20.14 లక్షల కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది. అంతక్రితం ఏడాదితో పోల్చితే ఇది 11.7 శాతం ఎక్కువని తెలిపింది. ఆర్థిక సంవత్సరం 2024లో నెల సగటు స్థూల వసూళ్లు రూ. 1.68 లక్షల కోట్లుగా ఉన్నాయని, అంతకుముందు సంవత్సరం ఇది రూ.1.5 లక్షల కోట్లుగా ఉందని ప్రస్తావించింది. కాగా ఏప్రిల్ 2023లో అత్యధికంగా రూ. 1.87 లక్షల కోట్ల జీఎస్టీ ఆదాయం వసూలైన విషయం తెలిసిందే.

## ఢిల్లిలో చిరుత కలకలం.. ఐదుగురు ఆస్పత్రికి!



ఢిల్లిలో మరోసారి చిరుతపులి సంచారం కలకలం రేపింది. ఇటీవలి కాలంలో ఢిల్లీ వాసులను వణికిస్తున్న చిరుత పట్టపగలే మరోసారి దర్శన మిచ్చింది. ఈ రోజు (సోమవారం) మధ్యాహ్నం ఉత్తర ఢిల్లిలో రూప్ నగర్‌లో చిరుతపులి ఓ ఇంట్లోకి చొరబడింది. ఈ క్రమంలో ముగ్గురిపై దాడిచేసినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియో నెటింట చక్కర్లు కోడుతుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం అగ్నిమాపక బృందం సాయంతో ఎట్టకేలకు దానిని బంధించారు. దీంతో అక్కడి జనం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ చిరుతను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక బృందం నానా కష్టాలు పడినట్టు సమాచారం. చిరుతని గదిలో బంధించామని, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించామని ఢిల్లీ అగ్నిమాపక అధికారులు వెల్లడించారు.

# ట్యాపింగ్ కేసు ఎవ్వర్ని వదలం

-మొదటి పేజి తరువాయి

అని బీఆర్ఎస్ వాళ్లకు భయం పట్టుకుందని ఉత్తమ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని, కేసీఆర్ కుటుంబం తప్ప మిగతా అందరూ కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్ పాలనను చూసి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి వస్తున్నారని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సీట్లు తప్పకుండా గెలుస్తామని ఉత్తమ్ జోస్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ మిగలదని స్పష్టం చేశారు. తెలంగాణలో తాగునీరు సమస్య, కరెంట్ సమస్య లేదని ఉత్తమ్ అన్నారు. కేసీఆర్ లాగా మాకు ఫామ్ హౌజ్ లో పడుకునే అలవాటు లేదని, ప్రతీరోజూ సచివాలయానికి వస్తున్నామని చెప్పారు. ప్రతి సమస్యపై వారంపదిరోజులకు ఒకసారి రివ్యూ చేస్తున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 40వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టారని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు దబాయింపు చేశారని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావటం జరగదని అన్నారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్దమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. ఒడిపోవడమే కాదు, పార్టీ మిగలదు అనే భయం కేసీఆర్‌లో మొదలైందన్నారు. పొంగనాలకు పోయి జాతీయ పార్టీ అన్నారని.. ఇంత తొందరగా ఏ పార్టీ కుప్ప కూలిపోలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదని అన్నారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప



బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. జనరేటర్ పెట్టుకొని మిటింగ్ పెట్టి, టెక్నికల్ ప్రాబ్లం వస్తే కరెంట్ పోయిందని కేసీఆర్ అబద్దం చెప్పారన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు అవుట్ డేటెడ్ టెక్నాలజీ అని.. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు వల్ల ప్రజలకే భారమన్నారు. రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా పవర్ పోవడం లేదన్నారు.పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ - జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు.

కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్దమే

హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్దమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. నిన్న కేసీఆర్ స్పీచ్ విన్నాక ఇంత సిగ్గు లేకుండా ఎలా మాట్లాడారు అని అనిపించిందన్నారు. ఒడిపోవడమే కాదు, పార్టీ మిగలదు అనే భయం కేసీఆర్‌లో మొదలైందన్నారు. పొంగనాలకు పోయి జాతీయ పార్టీ అన్నారని.. ఇంత తొందరగా ఏ పార్టీ కుప్ప కూలిపోలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదని అన్నారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. జనరేటర్ పెట్టుకొని మీటింగ్ పెట్టి, టెక్నికల్ ప్రాబ్లం వస్తే కరెంట్ పోయిందని కేసీఆర్ అబద్దం చెప్పారన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు అవుట్ డేటెడ్ టెక్నాలజీ అని.. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు వల్ల ప్రజలకే భారమన్నారు. రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా పవర్ పోవడం లేదన్నారు.

పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ - జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.

# అకౌంటెంట్‌ను సీఎండీ చేసిన ఘనత కేసీఆర్‌దే

-మొదటి పేజి తరువాయి

యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై ప్రస్తుతం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. కేసీఆర్ పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ ఒక్క కిలోమీటర్ కూడా తవ్వలేదు. కాళేశ్వరం కార్పొరేషన్ బకాయిలు చెల్లిస్తాం. డిఫాల్ట్ కాబోము. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతోంది. ఐఐటీలో చదివిన ఐఏఎస్‌లను డిస్కంలకు చీఫ్‌లను చేశాం. కేసీఆర్ మాత్రం ఒక అకౌంటెంట్‌ను సీఎండీ చేశారు' అని భట్టి విమర్శించారు.

**కేసీఆర్ ఆ విషయంలో చిల్లర ప్రచారం చేస్తున్నారు**

తెలంగాణ ప్రజలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మోయలేని భారం మోపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం నాడు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. జనరేటర్ పవర్‌తో నిన్నటి సభలో కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి మధ్యలో కరెంట్ పోయిందని చిల్లర ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసినా కేసీఆర్ పట్టించుకోలేదని మండిపడ్డారు.ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు.

2400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్



కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు 9 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆసంస్థకు లక్ష పదివేల కోట్ల రూపాయలను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ లాగా ప్రధానమంత్రి కావడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2019 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని... తాము వచ్చిన తర్వాత ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. 5 ఏళ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని... జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న దగ్గరి నుంచే వర్షాలు రావట్లేదన్నారు. రిజర్వాయర్‌లో ఎక్కడ నీళ్లు లేకున్నా అది కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో నీళ్లు లేకుండా కేసీఆర్ చేశారని భట్టివిక్రమార్క మండిపడ్డారు.

# రేవంత్ జర జాగ్రత్త..

-మొదటి పేజి తరువాయి

రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఇవ్వలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో రైతులు కుతకుత ఉడుకుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటడు. చెప్పుతో కొట్టమన్న ఆయన అహకంరానికి ఓటు అనే ఆయుధంతో వేటు వేయండి. రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటుండు. నల్లగొండ జిల్లా రైతన్నలకు విజ్ఞప్తి. అహంకారంగా మాట్లాడే ఈ జిల్లా నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

**లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు..?**

రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే, రూ. 15 వేల రైతుబంధు ఇవ్వాలంటే, వరి ధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తాము ఏవీ అమలు చేయకున్నా.. మళ్లీ మాకే ఓటేశారని తప్పించుకు తిరుగుతారు. సీఎం రేవంత్ జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నా అంటుండు. తనకు తెలిసి జేబు దొంగలు తిరుగుతారు ముఖ్యమంత్రులు తిరుగరు అని కేటీఆర్ తెలిపారు. పేగులు కట్ చేసి మెడలో వేసుకుంటా అంటుండు. అది ముఖ్యమంత్రి చేసే పనా.. అది బోటి కొట్టేదు చేసే పని. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయ కున్నా.. ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయి. అయినా లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**మీకు ప్రమాదమంతా నల్లగొండ, ఖమ్మం బాంబులతోనే ఉంది..**

నీ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆలోచన మాకు లేదు.. డేంజర్ బీఆర్ఎస్ నాయకులతో లేదు. మీకు ప్రమాదమంతా నల్లగొండ, ఖమ్మం బాంబులతోనే ఉంది. ఏక్‌నాథ్ షిండేలు మీ పార్టీలో ఉన్నారని బీజేపోళ్లు చెబుతున్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ వద్ద నేనొస్తా నేనొస్తా అని అంటున్నారట. నీ పక్కన ఉన్నారు డేంజర్ గాళ్లు. రేవంత్ రెడ్డి మీరు ఐదేండ్లు సీఎంగా ఉండాలి. కానీ 420 హామీలు అమలు చేయాలి. అవి అమలు చేయకపోతే వదలిపెట్టం. రుణమాఫీ చేయ్. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు



రూ. 2500 ఇస్తానని చెప్పావు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తా అన్నావు.. దాని కోసం రైతలు ఎదురుచూస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్ల మీద పడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేలు ఇచ్చి ఆదుకోవాలి. దమ్ముంటే ఈ పనులు చేసి చూపించు అని కేటీఆర్ సవాల్ చేశారు.

**ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుంది..**

పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారు. నిజం నిలకడ మీదనే తెలుస్తుంది. ఇదే తెలంగాణ ప్రజలు ప్రేమతో, దయతో పదేండ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ దాకా మాట్లాడారు. ఇవాళ రాహుల్ మాట్లాడుతూ.. మోదీ దొంగ అంటడు. రేవంత రెడ్డేమో మోదీ మా పెద్దన్న అని అంటుండు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే.. అదానీ మా ఫ్రెండ్ అని రేవంత్ అంటుండు. లిక్కర్ స్కాం లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయం అని రాహుల్ అంటుండు. లిక్కర్ స్కాం నిజమే. కవిత అరెస్టు కరెక్ట్ అని రేవంత్ అంటుండు. గుజరాత్ ఓ ఫేక్ మోడల్ అని రాహుల్ అంటడు.. తెలంగాణను గుజరాత్ మోడల్‌లా చేస్తా అని రేవంత్ అంటున్నాడు. రేవంత్ రాహుల్ కోసమా, మోదీ కోసమా పని చేసేది. ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇదే రేవంత్.. షెల్టర్, భవిష్యత్, కేసుల నుంచి బయటపడటం కోసం బీజేపీలో చేరుతారు. ఈ మాట పదిసార్లు అన్నాను. కానీ ఈ విషయంలో మాత్రం రేవంత్ స్పందించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరే మొదటి వ్యక్తి రేవంత్ రెడ్డి'

జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, జేబుదొంగలే ఆ పని చేస్తారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. నల్లగొండ లోక్ సభ బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాల్గొని కేటీఆర్ మాట్లాడారు. 'సీఎం రేవంత్‌రెడ్డి పేగులు మెడలో వేసుకుని తిరుగుతా అంటున్నారు. బోటీ కొట్టేవాళ్లే ఆ పని చేస్తారు. ఏక్ నాథ్ షిండేలు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. నల్లగొండ, ఖమ్మంలో ఉన్నవారితోనే నీకు(సీఎం రేవంత్‌రెడ్డి) ప్రమాదం ఉంది. కేసీఆర్ పర్యటన వీడియోలు చూస్తుంటే నల్లగొండలో ఎలా ఓడిపోయామని అనిపించింది.

ఎన్నికల ముందు నల్లగొండ జిల్లాలో జరిగిన సభలకు హాజరైతే జనాలు బ్రహ్మాండగా వచ్చారు. నల్లగొండ జిల్లాలో ఏడెనిమిది సీట్లు వస్తాయని అనుకున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు లోక్ సభ ఎన్నికల్లో జరగకుండా ఆత్మవిమర్శ చేసుకుందాం. భారతదేశంలోనే అత్యధికంగా లక్షా అరవై వేల ఉద్యోగాలు ఇచ్చి కూడా వారి మనసు గెలుచుకోలేదు. ముప్పై వేల ఉద్యోగాలు నేనే ఇచ్చానని రేవంత్ అంటున్నారు. నోటిఫికేషనే ఇవ్వకుండా ఉద్యోగాలు ఎలా ఇచ్చారో రేవంత్ చెప్పాలి. పోస్టల్ బ్యాలెట్లలో ఉద్యోగులు 70-80 శాతం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. 73 శాతం జీతం పెంచిన ఏకైక నాయకుడు కేసీఆర్. ఒకటిన జీతాలు ఇవ్వకపోయినందుకు బీఆర్ఎస్‌కు దూరం అయ్యారు. రైతులకు కేసీఆర్ చేసినంత మేలు దేశంలో ఎవరూ చేయలేదు. రైతుబంధు, 24 గంటల విద్యుత్ ఇచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్. రైతులు కూడా బీఆర్ఎస్‌కు దూరం అయ్యారు. జిల్లాలో ఫ్లోరోసిస్ బూతాన్ని పెంచిపోషించింది కాంగ్రెస్ పార్టీ. ఆ బూతాన్ని తరిమికొట్టింది బీఆర్ఎస్. కాంగ్రెస్ నాయకులు జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజ్ తీసుకురాలేకపోయారు.

## రూ. 151 చెల్లిస్తే.. ఇంటికే రాములోరి తలంబ్రాలు

-మొదటి పేజి తరువాయి



వైభవంగా జరగనున్నాయి. వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని ఉపయోగించుకోవచ్చు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-23450033, 040-69440000, 040-69440069ను సంప్రదించాలని సూచించారు.

## పార్లమెంట్ ఎన్నికలపై స్పెషల్ ఫోకస్..

-మొదటి పేజి తరువాయి

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులు, సీనియర్ నేతలను ఇన్‌ఛార్జ్‌లుగా నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిండెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు..

ఖమ్మం- పొంగులేటి శ్రీనివాసరెడ్డి నల్లగొండ- ఉత్తమ్‌కుమార్ రెడ్డి కరీంనగర్- పొన్నం ప్రభాకర్ పెద్దపల్లి- శ్రీధర్‌బాబు వరంగల్- రేవూరి ప్రకాశ్‌రెడ్డి మహబూబాబాద్- తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్- ఒబెదుల్లా కొత్వాల్ సికింద్రాబాద్- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భువనగిరి- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నాగర్‌కర్నూలు- జూపల్లి కృష్ణారావు మహబూబ్‌నగర్- సంపత్‌కుమార్ చేవెళ్ల- వేం నరేందర్‌రెడ్డి మల్కాజ్‌గిరి- మైనంపల్లి హన్మంతరావు మెదక్- కొండా సురేఖ నిజామాబాద్- పి.సుదర్శన్‌రెడ్డి ఆదిలాబాద్- సీతక్క జహీరాబాద్- దామోదర రాజనర్సింహ ఇదిలావుంటే.. తెలంగాణకు సంబంధించి మూడు జాబితాలు రిలీజ్ కాగా.. ఫస్ట్ లిస్ట్‌లో నలుగురు, సెకండ్ లిస్టులో ఐదుగురు, మరోలిస్టులో నలుగురు మొత్తం.. 13 మంది పేర్లను ప్రకటించింది కాంగ్రెస్.

మహబూబ్‌నగర్- వంశీచంద్‌రెడ్డి, జహీరాబాద్- సురేశ్‌షెట్కార్, మహబూబాబాద్- బలరామ్‌నాయక్, నల్గొండ- కుందూరు రఘువీర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి- సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్- దానం నాగేందర్, చేవెళ్ల- రంజిత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్- మల్లు రవి, పెద్దపల్లి- గడ్డం వంశీకృష్ణ, ఆదిలాబాద్- ఆత్రం సుగుణ, నిజామాబాద్- తాటిపర్తి జీవన్‌రెడ్డి, మెదక్- నీలం మధు, భువనగిరి- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లను ఫైనల్ చేశారు.

మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా టీ.కాంగ్రెస్ దూసుకెళ్తోంది. దానిలో భాగంగా.. దశల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తున్న కాంగ్రెస్.. తాజాగా.. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులు, సీనియర్ నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించింది. అయితే.. పోటీ ఎక్కువగా ఉండడంతో పెండింగ్‌లోనున్న వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ఖమ్మం ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తుందో చూడాలి.

**తెరపైకి కొత్త వ్యక్తి**

కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేయనుంది. ఇప్పటికే మిగతా13 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ నాయకత్వం ఖరారు చేసింది. ఖమ్మం సీటు కోసం ముగ్గురు మంత్రుల కుటుంబాలు పోటీ పడుతున్నాయి.

పోటీ పడుతున్న వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబం నుంచి తుమ్మల యుగంధర్ ఉన్నారు. ఈ ముగ్గురిని కాదని కాంగ్రెస్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కొత్తగా తెరపైకి వచ్చారు. మంత్రుల కుటుంబాలను కాదని వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కు టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. వరంగల్ స్థానం కోసం జరుగుతున్న సుదీర్ఘ కసరత్తు నిర్వహించనుంది. డి. సాంబయ్య, డా. పరమేశ్వర్, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ సహా పలువురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కడియం చేరిక నేపథ్యంలో వరంగల్ సీటుపై ఆసక్తి పెరిగింది. మాదిగ వర్గానికి ఈ సీటు ఇవ్వాలని మాదిగ జేఏసీ డిమాండ్ చేస్తోంది.

కడియం కుటుంబాన్ని మాదిగ వర్గంగా పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నుంచి ప్రవీణ్ రెడ్డి, సంతోష్ కుమార్ టికెట్ ఆశిస్తున్నారు. తీన్మార్ మల్లన్న పేరు తాజాగా తెరపైకి వచ్చింది. హుస్నాబాద్ స్థానాన్ని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ కోసం ప్రవీణ్ రెడ్డి వదులుకున్నారు. ముగ్గురిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గ చూపుతోందన్నది ఆసక్తికరంగా మారింది. అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తున్న హైదరాబాద్ స్థానం కోసం టెన్నిస్ స్టార్ సానియా మీర్జాతో పాటు షానవాజ్ తుబుసం పేర్లను పరిశీలిస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఈ నాలుగు స్థానాలతో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి మార్పుపై చర్చించే అవకాశం ఉంది. దానం నాగేందర్ పేరును అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్ రాజీనామా చేయలేదు. ఆయనను మార్చే పక్షంలో పరిశీలనలో బొంతు రామ్మోహన్ సహా మరికొందరి పేర్లున్నాయి.

## రివర్స్ రాజకీయం!?

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇప్పుడంతా రివర్స్ రాజకీయం నడుస్తోంది. భూమి గుండ్రంగా ఉందన్నట్లుగా గతంలోకేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని, నేతల్ని ఎలా పార్టీలో చేర్చుకున్నారో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నేతల్ని అలా చేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతిపక్షమే లేకుండా చేయాలనుకున్నారు కేసీఆర్. సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని రెండు సార్లు శాసనసభాపక్షాల్ని విలీనం చేసుకున్నారు. అయినా కాంగ్రెస్ బేషుగ్గా ఉంది. ఇప్పుడు అధికారంలోకి కూడా వచ్చింది. అంటే కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ తప్పని తేలిపోయింది. అయినా కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ అదే తప్పు ఎందుకు చేస్తోంది. కొత్తగా చేరే వాళ్లతో ఆ పార్టీకి లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ బీఆర్ఎస్ ఎంత ఉన్నత స్థితిని చూసిందో ఇప్పుడు అంతటి హీన స్థితిని ఎదుర్కొంటోంది. అధికారం రాగానే వచ్చిన నేతలంతా అధికారం పోగానే మళ్లీ అధికార పార్టీ వైపు వెళ్తున్నారు. సిట్టింగ్ ఎంపీల నుంచి మొదలుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యులు తమను తాము రక్షించుకునేందుకు పార్టీలు మారుతున్నారు. పెద్దపల్లి ఎంపీ సీటును కొప్పుల ఈశ్వర్‌కు ప్రకటిస్తారని తెలియగానే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేత పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పంచన చేరారు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చినా?గులాబీ బాస్ చెప్పినా.. రాత్రికి రాత్రే హస్తం గూటికి చేరి అదే పార్టీ నుంచి టికెట్ సంపాదించుకున్నారు. జహీరాబాద్, నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు బిబి.పాటిల్, రాములు బీజేపీ తీర్థం పుచ్చుకుని ఆ పార్టీ నుంచి మళ్లీ బరిలో నిలిచారు. అయితే రాములు మాత్రం తన కొడుకును లైన్లో పెట్టారు. ఇక హైదరాబాద్ శివారులో గట్టి పట్టున్న పట్నం మహేందర్ రెడ్డి చివరి క్షణంలో కాంగ్రెస్ గూటికి చేరి తన భార్య సునితారెడ్డికి మల్కాజిగిరి టికెట్ దక్కించుకున్నారు. ఇక దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గులాబీ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ కండువా కప్పుకుని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, ఆరూరి రమేష్, లాంటి నేతలు పార్టీలు మారారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అతని కూతురు వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ టికెట్ దక్కించుకున్న కడియం కావ్య, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, అతని కూతురు హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి లాంటి ముఖ్యులూ పార్టీ మారేందుకు సిద్దమయ్యారు. వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మెన్ల వరకొస్తే రాష్ట్ర వ్యాప్తంగా భారీగా పార్టీని వీడుతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ కమ్ సీఎంగా డబుల్ రోల్ పోషిస్తున్న రేవంత్ రెడ్డి పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ స్థిరీకరణ అనే కాన్సెప్ట్ ను ఏకకాలంలో అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన చేరికల కోసం గేట్లు ఎత్తారు. తాము గేట్లు ఎత్తామని ప్రకటించిన వెంటనే పోలోమంటూ పెద్ద ఎత్తున నేతలు తరలి వస్తున్నారు . కానీ వీరంతా కాంగ్రెస్ పతనం కోసమే వస్తున్నారని చరిత్ర నిరూపిస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి అండ్ టీం .. ఏటికి ఎదురీది గెలిచారు. ప్రస్తుతం పార్టీలో చేరుతున్న వారంతా కాగ్రెస్ పార్టీని ఓడించడానికి సర్వశక్తులు ఒడ్డిన వాళ్లే.

## సంపాదకీయం

# జంపింగ్‌లతో జర జాగ్రత్త!

పక్క పార్టీల నుండి అధికార పార్టీలోకి వచ్చినటువంటి నాయకులతో ఎప్పటికీ ఉన్న పార్టీలో ఉన్నటువంటి కార్యకర్తలకు,నాయకులకు ఇబ్బంది తప్పదు. అధికారం ఉందని పార్టీలు మారుస్తూ, వారి స్వలాభం కోసం పార్టీ కండువాలు సైతం మారుస్తున్నారు. అలాంటి వారికి పెద్దపీట వేస్తే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు. ఇది జగమెరిగిన సత్యం.అలాంటి వారిని ప్రజలు ఎప్పుడు వ్యతిరేకిస్తూనే ఉంటారు. గత ఎన్నికల్లో మనం చూసాం, ఎన్నికల్లో సైతం మనం చూస్తాం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ సీట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు కేవలం 38 మాత్రమే వచ్చాయి. దీంతో 2018 ఎన్నికల తర్వాత జరిగినటువంటి పరిణామాలు మళ్లీ కనిపిస్తున్నాయి. అప్పుడు కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో రాజకీయ నాయకులు జంప్ చేస్తే, ఈసారి అందుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నుంచి గెలిచినటువంటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, చైర్మన్లు, మాజీ చైర్మన్లు పార్టీ మారుతున్నారు. కొంతమంది కాంగ్రెస్ లోకి వెళ్తే మరికొంతమంది బీజేపీ వైపు వెళుతున్నారు. బీఆర్ఎస్ ఓడిపోవడంతో అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే రాజకీయ ముఖచిత్రం మారింది. కాంగ్రెస్ ముఖ్య నేతలను కలిసి తమ మనసులోని మాటను చెప్పకనే చెబుతూ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించేలా పలు వ్యూహరచనలు చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సైతం కొంతమంది కాంగ్రెస్ లోకి వెళ్తే మరికొంతమంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు సైతం బీజేపీలో చేరి పోటీ చేస్తున్నారు. మారుతున్న రాజకీయాల నేపథ్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు వారి రాజకీయ భవిష్యత్తు కోసం అధికారంలో ఉండే పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే, దేశంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంది. ఈ రెండు పార్టీలే రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో కీలకం కానున్నాయనేటటువంటి ఉద్దేశ్యంతో నాయకులు పార్టీలు మారుతున్నారు. దీంతో రాష్ట్ర,దేశ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పార్టీ లేవైనా పదవిలో ఉండాలనే లక్ష్యంతో పార్టీలు మారడానికి సన్నద్ధమవుతున్నారు. 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు వివిధ పార్టీల నుండి రాజకీయ నాయకులను తీసుకొని రెండు టర్మ్‌లు పాలించింది. అలా తీసుకున్న నాయకులే తిరిగి వెళ్ళిపోతున్నారు. జెండా మోసినటువంటి కార్యకర్త, ఉద్యమాన్ని నడిపినటువంటి కార్యకర్త, నాయకులు, ఉద్యమకారులు, పార్టీని వదిలి వెళ్లడం లేదు. పార్టీలో ఉండి అవకాశాల కోసం ఎదురు చూసినటువంటి సీనియర్ నాయకులు సైతం పార్టీని వదిలి వెళ్లడం లేదు. కష్టమైనా, సుఖమైన పార్టీతోనే అని భావించి, పార్టీ కష్టాల్లో ఉంది కాబట్టి పార్టీతో ఉండాలి, పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలి. ఆపదలో ఉన్న పార్టీకి అక్కున చేర్చుకోవాలని, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పొంగి పోకుండా, అధికారం లేనప్పుడు కృంగిపోకుండా, పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని ఉద్దేశంతో పార్టీతోనే మా ప్రయాణం అంటూ ఇప్పటికీ కొంతమంది నాయకులు బీఆర్ ఎస్ పార్టీని వీడడం లేదు. 2014 నుండి 2023 వరకు బీఆర్ఎస్ పార్టీని నమ్ముకున్నటువంటి నికార్సయిన నాయకులకు ఎటువంటి పదవులూ వారు అనుకున్న స్థాయిలో లభించలేదు. అయినా పార్టీతోనే ఉన్నారు. కొంతమంది నాయకులు వారి స్వార్థ బుద్ధితో బీఆర్ఎస్ పార్టీలో చేరి పదేళ్లు వివిధ పదవులను అనుభవించి మళ్లీ పదవుల కోసం, వాళ్ల రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీలు ఫిరాయిస్తున్నారు. అప్పుడు ఎలా అయితే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సరియైన మెజారిటీ ఉన్నా కానీ వివిధ పార్టీల నుండి ఎమ్మెల్యేలను, ఎంపీలను, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులను పార్టీలోకి తీసుకొని వారికి మంత్రులుగా, ఉపముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారు. అలా బయట నుండి వచ్చినటువంటి కండువా మార్చిన వారి పైన మాత్రమే కనికరం చూపించి, పార్టీ జెండా భుజాన ఎత్తుకున్న వారిపైన వెన్ను చూపించాడు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం పక్క పార్టీల నుండి వలసలను ప్రోత్సహిస్తున్నాడు. ఇలా చేయడం వల్ల పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్నటువంటి కార్యకర్తలకు నాయకులకు న్యాయం చేయడం అర్థమవుతుంది. నమ్ముకున్న వారిని నట్టేట ముంచడమవుతుంది. కాంగ్రెస్ పార్టీ ఈ విధంగా చేస్తే బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారం చేపట్టాలనే లక్ష్యంతో పావులు కదుపుతూ వివిధ పార్టీల నుండి తమ పార్టీలోకి తీసుకొని లోకసభ ఎన్నికల్లో టికెట్లు కేటాయించింది. వింటే సరాసరి, లేదంటే వారి పైన కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నటువంటి సంస్థలచే పలు కేసులు పెడుతూ రాజకీయ నాయకులను భయభ్రాంతులను చేస్తుంది. తద్వారా బీజేపీకి లాభం చేకూరుతుందనేటువంటి ఉద్దేశంతో ఇలా అనేక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటుకుంటుంది. కానీ ఇలాంటి పార్టీలు మారే జంపింగ్ రాజకీయ నాయకులతో ఆ ప్రాంతంలో ఉన్నటువంటి పార్టీ కోసం పని చేసినటువంటి నాయకులు టికెట్‌ను ఆశించి, టికెట్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కష్టకాలంలో పార్టీనీ, కార్యకర్తలను కాపాడుకుంటూ ఖర్చు పెట్టినటువంటి నాయకులు సైతం ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతేకాక ఇంతకుముందు పోటీచేసి ఓడిపోయిన నాయకులు తమకు కాకుండా వేరే వారికి టికెట్ ఎలా ఇస్తారు అని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా పక్క పార్టీల నుండి వచ్చినటువంటి వారికి పెద్దపీట వేయడం వల్ల ఉన్న పార్టీలో ఉన్నటువంటి కార్యకర్తలు నాయకులు నష్టపోవడం అనేది జగమెరిగిన సత్యం. దానిని నివారించడానికి ఉన్న పార్టీలో ఉన్నటువంటి వారిని కాపాడుకుంటే సరిపోతుంది అని విశ్లేషకుల అభిప్రాయం.

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి



డెన్మార్క్ దేశానికి చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ ఆండరసన్ 2 ఏప్రిల్ 1805 న జన్మించాడు. ఆయన పుట్టినరోజైన ఏప్రిల్ 2 ను అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ (%×దీడ్%) అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది. 1967 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి ?వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటి ల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడా నికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

# విధి నిర్వహణే ధ్యేయం



శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్న సత్యం.. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ళు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది అయిదు వసంతాలు దాటుతున్నా, వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోకపోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయ ప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించు కోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధారపడి ఉంటుందనేది నగ్నసత్యం.

విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అను క్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో, కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల అగ్రహానికి గురికాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం.

ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో "ధర్మవీర కమిషన్" సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. "సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా", ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు "స్వీయ రక్షణే" నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలోమమేకమవుతున్నారు.

తెలంగాణ గత ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. అలాగే పోలీసు స్టేషన్లకు పెద్దమొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్‌కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలుతో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల 'హోంగార్డు'లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతరపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపై దృష్టి సారించ లేక పోయింది...అలాగే క్రింది స్థాయి పదో న్నతుల ప్రక్రియ కొనసాగించ లేక పోయింది.

ప్రధానంగా "మీ వెంటే మేమున్నాం" అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, "మీ సంక్షేమమే మాకు ముఖ్యం" అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా కొత్త కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

## - మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కోరారు. పటాన్చెరు అసెంబ్లీ పరిధి బొల్లారంలో కాంగ్రెస్ నేతలు, ప్రజా ప్రతినిధులను మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొల్లారంలోని కౌన్సిలర్ చంద్రారెడ్డి ఇంటికి వెళ్లి కలిసిన నీలం మధు ఎన్నికలవేళ అనుసరించాల్సిన దానిపై నాయకులతో మధు చర్చించారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరిని కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐఎన్టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, కౌన్సిలర్లు వరప్రసాద్ రెడ్డి, చంద్రయ్య, గోపాలమ్మ, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్, చక్రపాణి, సంపత్ రెడ్డి, ఐ ఎన్ టి యు సి ప్రెసిడెంట్ శివ సాయి,కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులకు నీలం మధుకు ప్రత్యేకంగా శాలువాలు కప్పి వారిని సన్మానించారు. బొల్లారం మున్సిపాలిటీ కౌన్సిలర్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో నీ వాయిస్ ను వినిపించాలని నీలం మధుతో బొల్లారం మున్సిపాలిటీ కౌన్సి లర్ చంద్రారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పటాన్ చెరు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని బొల్లారంకు చేరుకున్న నీలం మధు చంద్రారెడ్డి ఇంట్లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మాట్లాడారు. మీ దయ సహాయ సహకారాలు ఉంటే తప్ప కుండా పార్లమెంట్లో అడుగు పెడతానని మధు అన్నారు.

# యూత్ కాంగ్రెస్ అధ్యక్షుని సన్మానించిన ఎంపీ అభ్యర్థి నీలం మధు





**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ను యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వరిగుంతం కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తాను ఇటీవల డాక్టరేట్ పొందడంతో నీలం మధు ఆయనను శాలువాతు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు హత్నూర మండల్ యూత్ కాంగ్రెస్ నాయకులు వరిగుంతం రాజు, గోవు శ్రీధర్, నీలం మధు సైన్యం శివ తదితరులు పాల్గొన్నారు.
ఇస్నాపూర్ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ లను మర్యాదపూర్వకంగా కలిసిన నీలం మధు నీలం మధు ముదిరాజ్ ఇస్నాపూర్ ఎంపీటీసీ సభ్యులు గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్ బాలామణి, ఎంపీటీసీ సభ్యులు అంజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బూరిగారి శోభకృష్ణ రెడ్డి గార్లను ఇంటికి వెళ్లి వారిని కలిశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీశైలం మాట్లాడుతూ.. సర్పంచి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి నేడు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఈ ప్రాంత వాసికి వచ్చిందని, ఇప్పుడు ఈ అవకాశం రావడం గోల్డెన్ ఛాన్స్ అని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్లమెంటు పరిధిలోని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకొనిపోయి ముందుకు వెళ్లాలన్నారు. ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



**వాస్తవ నేస్తం,భీంపూర్:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్ సూచించారు. సోమవారం మండలం నిపాని గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం అని తెలిపారు. అనంతరం ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారతి కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేమ రాజన్న, ఎన్వైకే సిబ్బంది మాజిద్, గాంధీ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తలకు గుర్తించాలి

### - డాక్టర్ వరిగుంతం కృష్ణ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తలకు గుర్తించాలి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ వరిగుంతం కృష్ణ అన్నారు. సోమవారం హత్నూర మండల్ దౌల్తాబాద్ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ నాయకులు తమ వ్యాపారాలను కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఆహర్నిశలు కృషిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు.

## వడదెబ్బకు సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు



**వాస్తవ నేస్తం,మధిర:** తెలంగాణ వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మధిర పట్టణంలో అంబేద్కర్ సెంటర్ వద్ద గుర్తుతెలియని వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోగా చుట్టుపక్కల వారు చూసి తగు సపరియలు చేసి ఆర్.కే ఫౌండేషన్ రెస్క్యూ టీం వారికి మధిర టౌన్ పోలీస్ వారికి తెలియజేయగా డాక్టర్ దోర్నాల రామకృష్ణ జ్యోతి సుదర్శన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వృద్ధురాలికి వైద్య చికిత్సలు అందించి ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమానికి తరలించారు. వృద్ధురాలి సమాచారం తెలిసినవారు మధిర టౌన్ పోలీస్, ఆర్.కే ఫౌండేషన్ ప్రజలు ప్రతినిధులకు తెల్పాలన్నారు. వృద్ధురాలి వివరాలు తెలిసినవారు 7702649709 ఈ నెంబర్ కు సంప్రదించాలన్నారు.

## కనుల పండువగా బొడ్రాయి వార్షికోత్సవం






**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలో శీతలమాత నాభిశిల (బొడ్రాయి) ఆరవ వార్షికోత్సవం కనుల పండువగ జరిగింది. తెల్లవారుజాము నుండే పట్టణంలోని నలుమూలల నుండి మహిళలు వేల సంఖ్యలో పెద్ద ఎత్తున పాల్గొని బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి పెద్ద ఎత్తున జలాభిషేకాలు జరిపి మొక్కులను చెల్లించుకున్నారు.భక్తులు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆవుల రామారావు మాట్లాడుతూ కోదాడ పట్టణంలో గత ఆరు సంవత్సరాలు క్రితం బొడ్రాయి పూనా ప్రతిష్టించిన నాటి నుండి పట్టణం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అమ్మవారి కరుణాకటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పున్న ప్రతిష్ట కమిటీ, ముత్యాలమ్మ కమిటీ, రైతు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్నా గిత్తే మధన్




**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని చేర్కువయ్ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన దంపతులైన కోడప సోనేరావు అనిత ల కుమార్తె జ్యోతి వివాహం ఈనెల 4న నిశ్చయించారు. కడు పేదరికంలో ఉన్న జ్యోతి వివాహానికి తనవంతుగా సహాయం చేయడానికి గిత్తే మధన్ ముందుకు వచ్చారు. సమాజ సేవకుడు గిత్తే మధన్ వివాహానికి అవసరమైన నిత్యవసర సరుకులు, రూపాయలు ఐదువేల నగదును తనవంతుగా సహాయం అందించి ఉదారతను చాటుకున్నారు. గిత్తే మధన్ సేవా గుణానికి పలువురు ప్రశంసించారు.

## టోల్ ట్యాక్స్'లో మినహాయింపు ఇవ్వాలి: టీజీవీపీ




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలోని నేరడిగొండ మండల కిష్టాపూర్ వద్ద ఏర్పాటుచేసిన టోల్ ప్లాజా వద్ద చెల్లించే టాక్స్ ను బోథ్ నియోజకవర్గ ప్రయాణికులకు మినాయింపు ఇవ్వాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ కోరారు. బోథ్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన ప్రజలు నిత్యము తమ అవసరాల దృశ్య నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళుతుంటారని, నియోజకవర్గ ప్రజలకు టోల్ ట్యాక్స్ లో మినహాయింపు ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ నియోజకవర్గ కో-కన్వీనర్ ఉల్లెంగుల సతీష్, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు షాపులపై దాడులు.. నిందితుల అరెస్ట్

### - పట్టణంలో పలుచోట్ల సిసిఎస్ పోలీసుల ఆకస్మిక దాడులు



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపాలనే జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బృందం పలు చోట్ల ఆకస్మిక దాడులను నిర్వహించి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారిపై కేసుల నమోదు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ ఏరియా వద్ద వాహనంపై నిందితుడు మామిడి కూడా సంబంధించిన మేశ్రం బాలాజీ వాహనంపై తరలిస్తున్న మధ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితుని వద్ద రూ 7300/- విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కే.ఆర్.కే కాలనీ నందు గైక్వాడ్ మధుకర్ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా అతని వద్ద రూ 2400/- రూపాయలు విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని, మావల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు.

## నవోదయ ఫలితాల్లో శ్రీ స్కూల్ విద్యార్థి ప్రతిభ




**వాస్తవ నేస్తం,కోదాడ:** నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కోదాడ శ్రీ స్కూల్ విద్యార్థి వశిష్ట గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆరవ తరగతిలో ప్రవేశానికై అర్హత సాధించాడు. కాగా సోమవారం పాఠశాల ఆవరణలో సీటు సాధించిన విద్యార్థితోపాటు తల్లిదండ్రుల ను అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. నరేష్, కరస్పాండెంట్ వేదంతరావులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, ప్రశాంతి, నరసింహారావు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

**నిజాంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట మండలం పరిధిలోని మండల విద్యాధికారి శనివారం నిజాంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లోళ్ళ రుద్రప్ప మార్చి 31 పదవి విరమణ పొందిన సందర్భంగా సోమవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గజ్జాల రమేష్ ముఖ్యఅతిథిగా రుద్రప్ప సేవలను కొనియాడారు. సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఘనంగా సన్మానించారు.

# షుగర్ ఉన్నవారు ఖర్జూర పండ్లు తింటే!




ఈ రోజుల్లో చాలామంది డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ డయాబెటిస్ కారణంగా ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగడం, తగ్గడం లాంటి సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. రక్తంలో షుగర్ లెవల్ ను అదుపులో ఉంచుకోవడానికి ఎన్నో రకాల చిట్కాలను ఉపయోగిస్తూ ఉంటారు. అలాగే రకరకాల మెడిసిన్స్ ని కూడా ఉపయోగిస్తూ ఉంటారు. అలాగే డయాబెటిస్ ఉన్నవారు ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్న కూడా సంకోచిస్తూ ఉంటారు. అటువంటి వాటిలో ఖర్జూర పండ్లు కూడా ఒకటి. షుగర్ ఉన్నవారు ఖర్జూరాలు తినొచ్చా? డయాబెటిస్ పేషెంట్లు తింటే రోజుకు ఎన్ని పండ్లు తినొవచ్చు? ఎక్కువ తింటే ఏమవుతుంది అన్న విషయాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఖర్జూరాలతో బోలెడు హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. వీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఖర్జూరాల్లో డైటరీ ఫైబర్ తో పాటు, విటమిన్ ఏ, విటమిన్ బీ, విటమిన్ బీ6, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ కె, కాపర్, నియాసిన్, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే ఇవి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ డయాబెటిస్ బాధితులు ఖర్జూరాలను రోజుకు రెండు మాత్రమే తినాలి. మితంగా తింటే పర్లేదు కానీ బాగా ఎక్కువగా తినకూడదు. ఖర్జూరాలు తియ్యగా ఉన్నప్పటికీ, వాటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది షుగర్ రోగులకు ఎలాంటి సమస్యని కలిగించదు. గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటే, రక్తంలో చక్కెరలో ఆకస్మిక పెరుగుదల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఖర్జూరాలు కాస్త లిమిట్ లో తినవచ్చు. అలా కాకుండా ఎక్కువ తింటే షుగర్ పెరుగుతుంది. ఇంకా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఖర్జూరాలు తినటం వలన డయాబెటిస్ కంట్రోల్ లో ఉండటమే కాకుండా బరువు తగ్గుతారు. అధిక రక్తపోటు తగ్గుతుంది.

# గర్భిణీ స్త్రీలు పైనాపిల్ తినవచ్చా?



స్త్రీలకు తల్లి అవడం అన్నది దేవుడిచ్చిన గొప్ప వరం. అందుకే స్త్రీలు ప్రెగ్నెంట్ గా ఉన్నప్పుడు అనేక రకాల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతూ ఉంటారు.ఆరోగ్యం విషయంలో కడుపులో ఉండే బిడ్డ విషయంలో తీసుకునే ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని చెబుతూ ఉంటారు. ఎందుకంటే గర్భిణీ స్త్రీలు చేసే ప్రతి ఒక్క పని కూడా తనపై తన కడపలో శిశువుపై ప్రభావం చూపిస్తుంది. తల్లి ఆరోగ్యంపైనే గర్భంలోని శిశువు ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో తల్లులు కూడా ఎన్నో సవాళ్లను ఎదుర్కోవా ల్సి వస్తుంది. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలలో కూడా చాలా ముఖ్యం. చాలామంది ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదు అన్న విషయాలు తెలియక తికమక పడుతూ ఉంటారు. అటువంటి వాటిలో పైనాపిల్ కూడా ఒకటి. గర్భిణీ మహిళలు పైనాపిల్‌ను ఆహారంగా తీసుకోవచ్చు. పైనాపిల్ ఒక రుచికరమైన, పోషకమైన పండు. ఇది గర్భధారణ సమయంలో చాలా ప్రయోజనాలను అందిస్తుంది. పైనాపిల్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది ఫోలేట్‌కు కూడా మంచి మూలం, ఇది గర్భధారణ సమయంలో ముఖ్యమైన పోషకం. ఫోలేట్ శిశువు మెదడు వెన్నెముక అభివృద్ధిలో సహాయపడుతుంది. పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది. ఇది శరీరంలోని పలు అవయవాల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గర్భధారణ సమయంలో సాధారణంగా కనిపించే మలబద్ధకం మరియు ఉబ్బసంల నుంచి ఉపశమనం కల్పించడంలో తోడ్పడుతుంది. అందుకే వైద్యులు పైనాపిల్ తీసుకోవాల్సిందిగా గర్భిణీ స్త్రీలకు సూచిస్తారు. అయితే కొందరు గర్భిణీ స్త్రీలు పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం జరుగుతుందని లేదా పిండం వృద్ధి చెందడంలో జాప్యం ఏర్పడుతుందని ఆందోళన చెందుతారు. ఇందులో ఎంత మాత్రం నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికి శాస్త్రీయమైన ఆధారాలు లేవని చెబుతున్నారు. అయితే గర్భస్రావం, పిండం వృద్ధి చెందకపోవడానికి పైనాపిల్ కారణం కాదని కొన్ని అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. పైనాపిల్ తినాలనుకునే గర్భిణీ స్త్రీలు ఇంకా ఏమైనా అనుమానాలుంటే వైద్యుడిని సంప్రదించి వారి సలహా తీసుకుంటే మంచిది. అలాగే పైనాపిల్ పూర్తిగా పండిందని నిర్ధారించుకోవాలి. పండని పైనాపిల్‌లో బ్రోమెలైన్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇది గర్భస్రావం లేదా పిండం యొక్క వృద్ధిలో జాప్యానికి కారణం కావచ్చు. పైనాపిల్‌ను చాలా ఎక్కువగా తీసుకోవద్దు. గర్భధారణ సమయంలో, మీరు రోజుకు ఒక కప్పు పైనాపిల్‌కు మించి తినకూడదు. పైనాపిల్‌ను తినే ముందు, దానిని శు భ్రం చేసి, గింజలను తీసివేయాలి.

## వడదెబ్బకు ఓఆర్ఎస్ మంచిదేనా?



ప్రస్తుతం ఎండలు దంచికొడుతు న్నాయి. మార్చి నెల మొదలైన నుంచే ఎండ తీవ్రత పెరిగిపోయింది. దీంతో ప్రజలందరూ ఉక్కపోత, వేడితో చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే వైద్యులు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. కొంత మంది అత్యవసర పని ఉండటం వలన ఎండలోనే వెళ్తుంటారు. దీంతో వారు వడదెబ్బకు గురి అయ్యే ప్రమాదం ఉంటుంది. కాగా, వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే ఏం చేయాలి? అసలు వడదెబ్బకు గురి అయితే ఓఆర్ఎస్ నీళ్లు తాగొచ్చా లేదా? అనే విషయం తెలుసుకుందాం. మనిషి శరీర సాధారణ ఉష్ణోగ్రత 97.8 డిగ్రీలు ఉంటుంది. ఇది సడెన్ గా 104 డిగ్రీలకు పెరగడాన్ని వడదెబ్బ లేదంటే సన్ స్ట్రోక్ అంటారు. వడదెబ్బ తగలగానే మనిషి వెంటనే అస్వస్థతకు గురవుతారు. దీంతో ఆ వ్యక్తికి కళ్లు తిరిగి పడిపోవడం,చెమట, ఒక్కోసారి స్పృహ కోల్పోవడం కూడా జరుగుతుంది. ఊపిరి కూడా సరిగ్గా ఆడదు. అయితే ఎండ దెబ్బ తాకిన వెంటనే వ్యక్తిని చల్లటి గాలిలో ఉండేలా చూడాలి. కొన్ని నీళ్లు తాగించాలి. అయితే కొంత మంది వడదెబ్బ తాకిన వ్యక్తికి ఓఆర్ఎస్ తాగిస్తారు. కానీ వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఓఆర్ఎస్ తాగించడం అస్సలే మంచిది కాదు అంటున్నారు నిపుణులు. దీని వలన కిడ్నీలు డ్యామేజ్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందంట. ఓఆర్ఎస్‌లో సోడియం, పొటాషియం, మెగ్నీషి యం ఉంటాయి. వడదెబ్బ తాకిన వ్యక్తిలో నీటి సాంద్రత అనేది పూర్తిగా తగ్గుతుంది. అలాంటి సమయంలో ఓఆర్ఎస్ తాగించడం వల్ల అది రివర్స్ ఎఫెక్ట్ చూపించే అవకాశం ఉంటుంది. అందువలన వడదెబ్బ తగిలినప్పు డు ఓఆర్ఎస్ కాకుండా దగ్గరిలోని నీరు తాగించాలి అంటున్నారు వైద్యులు.

# సమ్మర్‌లో ఆరోగ్యంగా ఉండాలా!




ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరిగిపోతుంది. దీంతో ప్రజలందరూ 10 దాటితే బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఇక అధిక వేడితో చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వేసవి అంటేనే,చెమటలు, చర్మం పొడిబారడం,డీ హైడ్రేషన్‌తో బాధపడటం, నీరసం ఇలా ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. అందువలన సమ్మర్‌లో కొన్ని హెల్త్ టిప్స్ పాటించడం వలన ఆరోగ్యంగా అలాగే అందంగా కూడా ఉంటారంట.కాగా, సమ్మర్‌లో పాటించాల్సిన టిప్స్ ఏవో ఇప్పుడు చూద్దాం. సమ్మర్‌లో వడదెబ్బ నుంచి మిమ్ముల్ని మీరు రక్షించుకోవడానికి ఎక్కువగా విటమిన్ సి అధికంగా ఉండే సిట్రస్, బెర్రీస్ తినడం అలాగే విటమిన్ ఇ అధికంగా ఉండే గింజలతో కూడిన సలాడ్స్ తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. వేసవి కాలంలో కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండ తీవ్రత కళ్ల మీద పడే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. దీని వలన కళ్ల చుట్టూ పెళుసుగా అవ్వడం. సూర్యరశ్మి ప్రభావంతో కళ్ళు మసకలు బారిపోవడం జరుగుతుంది. అందువలన బయటకు వెళ్లినప్పుడు సన్ గ్లాసెస్ పెట్టుకోవాలి. అలాగే దోసకాయ ముక్కలను గుండ్రగా కట్ చేసి కంటిపై పెట్టుకోవాలి. కళ్లకు వేడి తీవ్రత ఎక్కువగా అనిపించినప్పుడు కాటన్ ప్యాడ్స్ వాడటం మంచిది.సమ్మర్‌లో నల్లటి బట్టలు అస్సలే ధరించకూడదు. అలాగే స్పైసీ ఫుడ్, కూల్‌గా ఉండే ఐస్ క్రీమ్స్‌కు చాలా దూరంగా ఉండాలి.వేసవిలో ఎక్కువగా బయటకు వెళ్లే సమయంలో కాటన్ దుస్తులు, తెల్లటి వస్త్రాలు ధరించడం మంచిది.వేసవిలో ఏదైనా పని మీద బయటకు వెళ్లి వచ్చినప్పుడు మన శరీరం చెమటతో తడిచిపోతుంది.అధిక చెమట పట్టిన తర్వాత చల్లటి నీటితో స్నానం చేయడం మంచిదంట. దీని వల్ల చర్మాన్ని అన్ బ్లాక్ చేయడంలో ఇది సహాయపడుతుంది. దీని వలన మొటిమలు రాకుండా ఉంటాయి.హైడ్రేట్‌గా ఉండటానికి ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి. అంతే కాకుండా తప్పనిసరిగా బ్యాగ్‌లో వాటర్ బాటిల్, కర్చీఫ్ ఉండేలా చూసుకోవాలంట. సమ్మర్‌లో ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా కొబ్బరి బోండాలు, నిమ్మరసం తాగడం ఆరోగ్యకరం అంటున్నారు వైద్యులు.

# రాగి సంగటితో ఆరోగ్యం



మన చుట్టూ పండేటువంటి వాటిలలో రాగులు కూడా ఒకటి.. అయితే రాగులు మన శరీరానికి అవసరమైన పోషకాలను సైతం అందిస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉండేటువంటి ఖనిజాలు, విటమిన్స్ వంటివి మన శరీరానికి చాలా అవసరము..రాగి రొట్టి, రాగి సంగటి వల్లే మనం శక్తివంతంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. చాలా మందికి రాగి రొట్టె తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు తెలిసి ఉండవు ఒకవేళ తెలిస్తే వీటిని కచ్చితంగా తింటారు.రాగులలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా ఇందులో ఫైబర్ కంటెంట్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. దీనివల్ల బరువు కూడా కంట్రోల్ చేస్తూ తగ్గడానికి సహాయపడుతుంది. రాగులలో ఎక్కువగా కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలు బలంగా ఉంచేలా సహాయపడుతాయి.. రాగి రొట్టెని, రాగి ముద్దని క్రమం తప్పకుండా తినడం వల్ల మీ ఎముకలు కూడా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా బోలు ఎముక వ్యాధి నుంచి కూడా బయటపడేలా చేస్తుంది. రాగులలో ఉండేటువంటి కార్బోహైడ్రేట్లు ఇవి నిరంతరం శక్తిని సైతం అందిస్తాయి..రాగులలో కరగని ఫైబర్, పాలి ఫెనాల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే ఫైబర్ కూడా ఉండడం వల్ల ఇవి ఎల్డి ఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తగ్గించడానికి ఉపయోగపడతాయి. దీనివల్ల గుండె ఆరోగ్యంగా కూడా ఉంటుందట.రాగులల ఫైబర్ కంటెంట్ కాస్త ఎక్కువగా ఉండడం వల్ల జీర్ణ క్రియకు ఇది చాలా ఉపయోగపడుతుంది. అలాగే జీర్ణ వ్యవస్థను కూడా మంచిగా ఉండేలా చూస్తోంది. మలబద్ధక సమస్యను కూడా నివారించి పెద్దప్రేగు కదలికను కూడా జరిగేలా చేస్తుంది.హైబీపీతో రక్తహీనతతో ఎముకల వీక్నెస్తో ఇబ్బంది పడేవారు రాగి జ్యూస్ తాగడం లేదా రాగి ముద్ద తినడం వల్ల ఇలాంటి సమస్యల నుంచి బయటపడవచ్చు.. వీటితోపాటు అజీర్తి సమస్యను కూడా తగ్గించుకోవచ్చు. అందుకని మన పూర్వీకులు కూడా ఎక్కువగా రాగి సంగటిని ఎక్కువగా ఇష్టపడి తింటూ ఉండేవారు.

# స్థానిక వార్తలు

## నేటి రిక్షా కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** పట్టణ కేంద్రంలోని రిక్షా కాలనీలో స్వస్థ శ్రీ శుభ కృతనామ సంవత్సర పాల్గొన్న మాసబూల అష్టమి నేటి నుంచి పాల్గొనము బహుళదశ మీ గురువారం వరకు శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన కార్యక్రమలు నిర్వహిస్తున్నట్టు రిక్షా కాలనీ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేడు ఉదయం 9. 15 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మంగళవాద్య వేద స్వస్తి వచనములతో గోపూజ, విగ్నేశ్వర పూజ పుణ్యాహవచనము, రుత్విగా వరణము, పంచ గృహ యజ్ఞ చాలా ప్రవేశము, దీపారాధన, నవగ్రహ వాస్తు, యోగినీ క్షేత్రపాల, సహిత లింగంతో భద్ర మండల దేవత స్థాపనములు అగ్ని ప్రతిష్ట మూలమంత్ర ఆహ్వానములు తాపిత దేవత ఆహ్వానములు సాయంత్రం నాలుగు గంటల నుంచి మహిళలు ఇచ్చే సామూహిక కుంకుమార్చన ఉంటుందన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల స్థాపిత దేవత నిత్య పూజలు సర్వతోభద్ర మండల దేవత ఆనములు ఏకశితి స్థాపనము దేవాలయ ప్రసాద్ వాస్తు పూజలు ధన్యాజిత వాస షయ్యాదివాస పుష్ప ఫలాదివ వాసములు హారతి మంత్రపుష్పములు చతుర్వేద సేవలు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## లకావత్ వీరన్నకు పరామర్శన ఎంపీపీ శ్రీనివాస్ నాయక్

**వాస్తవ నేస్తం,ఖమ్మం:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లకావత్ వీరన్న ఖమ్మం నగరంలోని సంకల్ప హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న కూసుమంచి ఎంపీపీ శ్రీనివాస్ నాయక్ సోమవారం సంకల్ప హాస్పిటల్ విచ్చేసి లకావత్ వీరన్న పరామర్శించారు. అనంతరం వీరన్నకు అందుతున్న వైద్య సేవలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం సేవలందించాలని సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్ నాయక్ తో పాటు ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ తదితరున్నారు.

## మూడేళ్ల తర్వాత రిటైర్మెంట్స్...

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయి. 2021, మార్చిలో అప్పటి ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు ను 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. దీంతో మూడేళ్లు రిటైర్మెంట్లు ఆగిపోయాయి. రిటైర్మెంట్ అవ్వాల్సిన వారు కంటిన్యూ అయ్యారు. మూడేళ్లు కావడంతో మళ్లీ రిటైర్మెంట్లు మొదలయ్యాయి. పలు కార్యాలయాల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది రిటైర్ అయ్యారు. వారికి అధికారులు అభినందనలు తెలిపారు.తెలంగాణలో మార్చి 30న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలు, సొసైటీల్లో ప్రభుత్వరంగ సంస్థల్లో 60 మంది, ఆర్టీసీలో 176 మంది, పోలీస్ శాఖలో 100 మంది రిటైర్ అయ్యారు. రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీనెల ఇచ్చే పింఛన్ ఖరారు చేసి మరుసటి నెల నుంచి మంజూరు చేయాలి.ఇక రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యోగులు నెల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీటిని ఏజీ కార్యాలయంలో ఆమోదించిన తర్వాత విరమణ ప్రోత్సాహకాలు అందుతాయి. పింఛన్ మినహా ఇతర ప్రోత్సాహయాలు ఆలస్యం అవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ చనిపోయిన వారికి సైతం ఆరు నెలలు గడిచినా ప్రోత్సాహకాలు అందడం లేదని వాపోయారు. ఉద్యోగి రిటైర్ అయిన రోజు ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు.ఇదిలా ఉండగా కేసీఆర్ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో మూడేళ్లపాటు ఉద్యోగాల భర్తీ నిలిచిపోయింది. ఖాళీలు కాకపోవడంతో పోస్టులు అలాగే ఉండిపోయాయి. దీంతో మూడేళ్లు నిరుద్యోగులు సర్వీస్ కోల్పోయారు. ఇక కొంతమంది వయోపరిమితి దాటడంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అర్హత కూడా కోల్పోయారు.

## భాగ్యనగరం నుంచి అయోధ్యకు డైరెక్ట్ విమాన సేవలు

**న్యూఢిల్లీ :** అయోధ్య రామయ్య భక్తులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. శ్రీరాముడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసును అందుబాటులోకి తెచ్చింది. భాగ్యనగరం నుంచి అయోధ్యకు డైరెక్ట్ విమాన సేవలు అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అయోధ్యకు విమాన సర్వీసు ప్రారంభించాలని.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ఫిబ్రవరి 26న లేఖ రాశానని చెప్పారు. దీనిపై స్పందించిన సింధియా.. వాణిజ్య విమానయాన సంస్థలతో మాట్లాడి విమాన సర్వీసు వచ్చేలా చర్యలు చేపట్టారన్నారు. ఈ విమానం సేవలు ఏప్రిల్ 2 నుంచి వారానికి 3 రోజులు (మంగళవారం, గురువారం, శనివారం) అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్

**సికింద్రాబాద్ :** తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ గ్రామం లో కార్డాన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించిన నార్త్ జోన్ పోలీసులు 23 టు వీలర్ వాహనాలు ఒక త్రీ వీలర్ ఆటో మరియు సరైన పత్రాలు లేనటువంటి వాహనాలు సీజ్ చేసి తిరుమలగిరి పోలీస్ స్టేషన్ కు తరలించారు తనకిలో భాగంగా 10 మంది ఎస్సైలు ఆరుగురు సిఐలు 70 మంది కానిస్టేబుళ్లు మరియు ఏసిపి పూర్తిస్థాయిలో పాల్గొన్నారు

## మహమ్మాబాద్‌లో కొండా ప్రచారం

**వికారాబాద్ :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతు న్నారు. ప్రత్యర్థులు అందరికన్నా ముందుగానే ప్రచారం చేపట్టిన ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ప్రజలతో మమేకమవుతున్నారు. యాత్రలో భాగంగా అయన పరిగి నియోజకవర్గం లోని మాహమ్మదాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మొహమ్మదాబాద్, కొలింపల్లి, కాచి న్ పల్లి, మొకర్లబాద్, చౌదర్ పల్లి, బోరింగ్ తండా గ్రామాల్లో యాత్ర నిర్వహించిన కొండ విశ్వేశ్వర్ రెడ్డి స్థానికులతో ముచ్చటించారు. తాను లోక్సభ సభ్యుడిగా చేసిన అభివృద్ధిని గ్రామస్తులకు గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తన గెలిపించడం ద్వారా నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఈ నెల 3 నుండి 30 వరకు ప్రత్యేక ఓటర్లు చైతన్య కార్యక్రమాలు

**– జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఈ నెల 3 తేదీ నుండి 30వ తేదీ వరకు ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 3 నుండి 30వ తేదీ వరకు ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికలు అధికారి అన్నారు. సోమవారం కలెక్టరెట్ లోని సమావేశమందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ఎన్నికలు నోడల్ అధికారులతో స్వీప్ కార్యక్రమాల నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా శతశాతం పోలింగ్ జరిగేలా ఈ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ స్వీప్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈనెల మూడవ తేదీన అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఆయా గ్రామాల ఓటరు జాబితాను బిఎల్వోలు ప్రదర్శించాలన్నారు.



స్వీప్ 2024 కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం తమ పేరు నమోదు చేసుకునేలా ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా ఈ మూడో ఈనెల మూడవ తేదీ నుంచి 30వ తేదీ వరకు వివిధ రకాల చైతన్య కార్యక్రమాల నిర్వహణ కోసం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బిఎల్ఓలు ఎంపీడీవోలు, ఏఈఆర్వోలు, ఏఆర్వోలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి జగదీరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం సభా వేదికల ఏర్పాటు మంచినీటి వసతి ఏర్పాటు ట్రాఫిక్ నియంత్రణ తదితర కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఈ కార్యక్రమా ఈ ప్రత్యేక కార్యక్రమాలు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి జగదీరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బజార్హత్నూర్‌లో గుప్త నిధి తవ్వకాల కలకలం..?

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

### భయాందోళనలో మండల ప్రజలు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆధునిక యుగంలో కొత్త కొత్త హంగులతో ముందుకు సాగుతున్న నేటి సమాజం. ఇందుకు విరుద్ధంగా కొందరు ప్రబుద్ధులు గుప్త నిధుల తవ్వకాలతో జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలంలోని ఓ పురాతన గృహంలో గత నెల క్రితం క్షుద్ర పూజల పేరిట గుప్తనిధుల తవ్వకాలు జరిగాయని, గుప్త నిధుల తవ్వకాలలో ఆరు తేరిన జిల్లా కేంద్రానికి చెందిన పలువురిని మండలానికి రప్పించి నిధిని సైతం వెలికి తీశారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల క్రితం నుండి కొంచెం కొంచెంగా పథకం ప్రకారం ప్రబుద్ధులు ఇటీవల కాలంలో సదరు గృహంలో క్షుద్ర పూజలు నిర్వహించి నిదిని వెలికి తీశారని మండల కేంద్రంలో ఆ నోట ఈ నోట చర్చించుకోవడం మొదలైంది. ఇంత పెద్ద మొత్తంలో క్షుద్ర పూజలు నిర్వహిస్తూ, గుప్త నిధులను తవ్వకాలు జరుగుతున్న కూడా పలు శాఖాలకు చెందిన యంత్రాంగాలు ఇటుపక్క చూసిన దాఖలాలు మాత్రం కనబడడం లేదని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

గుప్త నిధుల పేరిట క్షుద్ర పూజలు నిర్వహించి మూగజీవాలను బలి చేశారని టాక్ నడుస్తోంది. గతంలో కూడా ఇదే మండలంలో గుప్తనిధుల తవ్వకాల కోసం చిన్నారులను సైతం బలిచ్చిన సంఘటనలు ఉన్నాయి. మండల కేంద్రంలో గుప్తనిధి తవ్వకాలు జరగడంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



# వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి





### జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** వేసవిలో త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని. జిల్లా పాలనాధికారి రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పలు శాఖల అధికారులతో కలెక్టరేట్ లో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాలలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత అధికారులను ఆదేశించారు. తీవ్ర నీటి ఎద్దడి ఉన్నచోట ట్యాంకర్స్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని, గ్రామాల్లో ప్రస్తుతం త్రాగునీటి సరఫరా, బోర్లు, ఓపెన్ బావులు, నీటి వనరుల గురించి మండలాల వారిగా ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి విషయమై పైప్ లైన్, మోటార్ల మరమ్మతులు తదితరాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. త్రాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బోరుబావులు, పాత త్రాగునీటి వనరులు పున:రుద్ధరించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సమ్మర్ యాక్షన్ ప్లాన్ రెండు రోజుల్లో సమర్పించాలని, ఎండ తీవ్రత ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో నీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, మిషన్ భగీరథ నీరు రాని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఎండ తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని ప్రజలు బావుల వద్ద కు, బయటకు రాకుండా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు .


సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాల లో త్రాగునీటి సరఫరా పై సమీక్షిస్తూ గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులూ ఏర్పడకుండా క్షేత్ర స్థాయిలో నీటి లభ్యత, సరఫరాల పై పర్యవేక్షిస్తూ వుండాలని పైపులైన్ లీకేజీ లు ఉండకుండా మరమ్మత్తులు చేయించాలని, అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటెన్ చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్లలను, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇంజనీర్లు క్షేత్రస్థాయి లో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులు గుర్తించి కమిటి తీర్మానాలు చేసుకోవాలని తెలిపారు.

# గులాబీకి తెలుసుస్తొన్న నొప్పి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతలు వరస పెట్టి పార్టీని వీడి వెళు తున్నారు. కేవలం ఒక్కసారి ఓటమితో నాయకత్వంపై నమ్మకం లేదంటూ జెండాలు పక్కన పడేసి, తమకు ఇచ్చిన టిక్కెట్లు చించేసి మరీ కాంగ్రెస్ లోకి వెళుతున్నారు. మొన్ననే ఆ మధ్య పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక మాట చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయిన రోజు ఒక గేటు తెరిచామని, ఇక కాస్కో కేసీఆర్ అని బహిరంగంగానే రేవంత్ ఛాలెంజ్ విసిరారు. అందుకు అనుగుణంగానే పెద్దయెత్తున నేతలు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారు. తాము ఊహించని పేర్లు కూడా చేరికల జాబితాలో వినిపిస్తుండటంతో గులాబీ పార్టీ నేతలకు గూబ గుయ్యమనేలా అనిపిస్తుందట. 2014లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ప్రభుత్వాన్ని ఇతర రాష్ట్రాల రాజకీయాలకు భిన్నంగా నడుపుతారనుకున్నారు. కానీ నాడు ఒక పార్టీ అంటూ లేదు.. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ... చివరకు కమ్యునిస్టులను కూడా కేసీఆర్ కాకా వదిలిపెట్టలేదు. ఎమ్మెల్యేలంతా తన దొడ్లోనే ఉండాలనుకునే మనస్తత్వానికి వచ్చేసిన కేసీఆర్ ఎవరినీ వదలకుండా అడ్డగోలుగా పార్టీలో చేర్చుకున్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పార్టీలను ఏకంగా శాసనసభపక్షాలనే తమలో కలిపేసుకున్నది కూడా ఎవరూ మర్చిపోలేరు. 2018 లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత చెలరేగిపోయారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి తన వైపు వస్తున్నారని పైకి చెబుతూ అందరినీ తన దారిలోకి తెచ్చుకున్నారు. ఫిరాయింపుల చట్టాన్ని తీసి పక్కన పడేశారు. సిట్టింగ్ స్థానమూ పాయె గొంతు చించుకున్నా.... కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. కేటీఆర్, హరీశ్ రావు లాంటి వాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. కానీ గత పదేళ్లలో కేసీఆర్ ఇదే పనిచేస్తున్నప్పుడు ఈ బాధ తెలియలేదా? అన్న ప్రశ్నలు వారికి సూటిగానే తగులుతున్నాయి. కేసీఆర్ ఫిరాయింపులను మొదలుపెడితే.. రేవంత్ రెడ్డి దానిని కంటిన్యూ చేస్తున్నాడంతే. అంతకు మించి ఆలోచించడానికి వేరే ఏమీ లేదు. అన్యాయం... అక్రమం అంటూ అరచి గగ్గోలు పెట్టినా ఉపయోగం లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ కు పెద్ద బొక్క పడింది. ఆ బొక్కలో నుంచి వెళ్లే నేతలను ఆపడం ఎవరి తరమూ కావడం లేదు. అందులోనూ గత పాలనకు, ఇప్పటి ప్రభుత్వ పనితీరుకు బేరీజు వేసుకుని వెళ్లేవాళ్లు అనేక మంది ఉన్నారు.

## ఆ ఊహ ఒక్క రోజులో జరిగింది కాదు..

### విజయ్ దేవరకొండ ప్రశ్నకు చిరంజీవి రిప్లై



త్వరలోనే ఫ్యామిలీ స్టార్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు విజయ్ దేవరకొండ ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే రౌడీబాయ్, మెగాస్టార్ చిరంజీవి ఒకే ఫ్రేములో ఉంటే ఎలా ఉంటుంది. ఓ ఈవెంట్‌లో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవితో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ చిట్‌చాట్ చేశాడు. ఏవీలో మెగాస్టార్ జర్నీ చూస్తుంటే భావోద్వేగానికి గురయ్యానని చెప్పాడు విజయ్ . ఈ రోజు తాను ఈ స్థితిలో ఉంటానని ఎప్పుడూ అనుకోలేదన్నాడు. మీరు మెగాస్టార్ , పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత అవుతారని ఊహించారా అని విజయ్ దేవరకొండ అడిగాడు. దీనికి చిరంజీవి మాట్లాడుతూ..ఆ ఊహ ఒక్క రోజులో జరిగింది కాదు. నా మనసులో నిత్యం కొన్ని విజువల్స్ చూసేవాడిని. స్కూల్‌లో, కాలేజీలలో డ్రామాలు, నాటకాల్లో పాల్గొని ఉత్తమ నటుడి అవార్డులు అందుకున్నాను. ప్రజలు నన్ను గుర్తించి మెచ్చుకునేవారు. నాకు చాలా గర్వంగా అనిపించేది. ఆ ప్రశంస నాలో కోరికను పెంచింది. దీంతో సెలబ్రిటీలు చాలా ఎక్కువ అటెన్షన్ పొందుతారని తెలుసుకున్నా. నా ఇష్ట దేవుడైన హనుమంతుడిని ప్రార్థిస్తూ.. నేను నా కల కోసం పని చేస్తూనే ఉన్నాను. నన్ను నేను నమ్ముకుని ఇండస్ట్రీలో పెద్దగా ఎదిగాను. నేను అలాంటి స్థాయికి చేరుకుంటానని నాకు తెలుసునన్నాడు. చిరంజీవి కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారన్న విజయ్ దేవరకొండ.. మీ కుటుంబంలో ఫ్యామిలీ స్టార్ ఎవరని చిరును అడిగాడు. చిరంజీవి స్పందిస్తూ.. తన తండ్రి తన ఫ్యామిలీ హీరో అని, ఫ్యామిలీ స్టార్ అని అన్నారు. మా నాన్న సంపాదించేది తక్కువే అయినా, అమ్మానాన్నల బాగోగులు చూసుకునేవాడని చెప్పాడు.



## దసరా లాంటి బ్లాక్‌బస్టర్ కోసం




దసరా లాంటి బ్లాక్‌బస్టర్ కోసం..2023లో రిలీజైన పీరియడ్ లవ్, మాస్ యాక్షన్ డ్రామా 'దసరా' బిగ్గెస్ట్ హిట్స్‌లో ఒకటి. ఈ చిత్రానికి పని చేసిన త్రయం మరోసారి ప్రేక్షకులకు సరికొత్త చిత్రాన్ని చూపించేందుకు రెడీ అవుతున్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న కొత్త చిత్రం కోసం దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టారు. శ్రీకాంత్ ఓదెల 'దసరాతో రచయితగా, దర్శకుడిగా తన సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు. మునుపెన్నడూ లేని మాస్ క్యారెక్టర్‌లో నానిని ప్రెజెంట్ చేశారు. ఈ కొత్త సినిమా అనౌన్స్ మెంట్ పోస్టర్ ఎరుపు రంగులో పెయింట్ చేయబడింది. ఇది వైలెన్స్‌ని సూచిస్తోంది. నాని గడ్డం, మెలితిప్పిన మీసాలతో మ్యాసీవ్ అవతార్‌లో కనిపించారు. నానిని పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేయడానికి శ్రీకాంత్ మరో విన్నింగ్ స్క్రిప్ట్ రెడీ చేశారని చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రాన్ని 2025 వేసవిలో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

## చీరలో రాశి పోసిన అందం



మోడర్న్ ఔట్ ఫిట్ వేసినా.. చీర కట్టినా.. ఎలా అయినా అందంగా, సెక్సీగా కనిపించే బ్యూటీ రాశి ఖన్నా. అవకాశాలు తగ్గాక సూపర్ హాట్ ఫొటో షూట్లతో సోషల్ మీడియా కుర్రాళ్లకు రెగ్యులర్ ట్రీట్స్ ఇస్తున్న రాశి..అప్పుడప్పుడూ చీరలోనూ మెరిసిపోతుంటుంది. తాజాగా ఆమె తన కొత్త చిత్రం ఆరణ్మయి-4 ఆడియో వేడుకలో పాల్గొంది. ఈ కార్యక్రమంలో మరో హీరోయిన్ తమన్నా కూడా పాల్గొంది. కానీ అందరి దృష్టి రాశి మీదే నిలిచింది. పసుపుపచ్చ వర్ణంలో చీర కట్టిన రాశి పోత పోసినట్లున్న అందాలతో మత్తెక్కించేసింది. చీరలోనే అందాలను ఎంతగా ఎలివేట్ చేయొచ్చో అంతా చేసింది రాశి ఖన్నా. మోడర్న్ ఔట్‌ఫిట్‌ను మించి సెక్సీగా ఉందంటూ ఆమె అందాలకు ఫిదా అయిపోతూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. నిన్నట్నుంచి రాశి ఫొటోలు సోషల్ మీడియాను కళకళలాడిస్తున్నాయి. ఈ మధ్య రాశి కెరీర్ కొంచెం డల్ అయింది. తెలుగులో దాదాపుగా అవకాశాలు ఆగిపోయాయి. తమిళంలో కూడా కెరీర్ ఏమంత గొప్పగా లేదు. ఔట్ డేటెడ్ హార్రర్ కామెడీ జానర్లో రాశి చేసిన ఆరణ్మయి-4 త్వరలోనే విడుదల కాబోతోంది. సీనియర్ దర్శకుడు సుందర్.సి ఆరణ్మయి ఫ్రాంఛైజీలో తీసిన నాలుగో సినిమా ఇది. ఈ చిత్రాన్ని రాశి, తమన్నాల గ్లామరే కాపాడాలి. అంతకుమించి ఆకర్షణలేమీ కనిపించడం లేదు సినిమాలో.



## తంగలాన్ అనౌన్స్‌మెంట్ ఆన్ ది వే!

ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు కోలీవుడ్ హీరో చియాన్ విక్రమ్ ఈ స్టార్ యాక్టర్ నటిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి తంగలాన్ మలబార్ సోయగం మాళవిక మోహనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో మాళవిక ఇదివరకెన్నడూ కనిపించని విధంగా.. కంప్లీట్ డీగ్లామరైజ్డ్ రోల్‌లో నటిస్తున్నట్టు.. తంగలాన్ నుంచి షేర్ చేసిన మాళవికా మోహనన్ లుక్ క్లారిటీ ఇచ్చేస్తుంది. తంగలాన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. కాగా ఏప్రిల్ 17న విక్రమ్ బర్త్ డే. ఈ నేపథ్యంలో తంగలాన్ మేకర్స్ రిలీజ్ డేట్ ను ప్రకటిస్తారని సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక అప్‌డేట్ కూడా రానున్నట్టు టాక్. పా రంజిత్ దర్శకత్వంలో తమిళ్ అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాను 2024 ప్రథమార్థంలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ మేరకు ఏప్రిల్ నెలలోనే రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. తంగలాన్ గ్లింప్స్ వీడియో సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. తంగలాన్ 2డీ, 3డీ ఫార్మాట్లలో కూడా విడుదల కాబోతుంది. పార్వతి తిరువొత్తు మరో ఫీ మేల్ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తోన్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

## ఆర్య 3 అవకాశమే లేదు

అల్లు అర్జున్ కెరీర్ ని గొప్ప మలుపు తిప్పిన బ్లాక్ బస్టర్ గా ఆర్య తనకే కాదు డెబ్యూ చేసిన దర్శకుడు సుకుమార్ కి, అభిమానులకు ఎంతో స్పెషల్ గా నిలిచిపోయింది. గంగోత్రిలో లుక్స్, నటన గురించి కామెంట్ చేసిన వాళ్లకు బన్నీ రెండో చిత్రంతోనే బదులు చెప్పడం చిన్న విషయం కాదు. రాబోయే మే 7 ఈ క్లాసిక్ లవ్ స్టోరీకి 20వ వార్షికోత్సవం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మాత దిల్ రాజు భారీ ఎత్తున రీ యూనియన్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నారు. నిన్న లవ్ మీ సాంగ్ లాంచ్ లో ప్రకటించేశారు. ఆర్య 2 ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదనే సంగతి తెలిసిందే.అంతగా ఆడకపోయినా బన్నీ క్యారెక్టరైజేషన్, దేవిశ్రీ ప్రసాద్ పాటలకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ నేపథ్యంలో ఆర్య 3 ప్రకటన ఏమైనా రావొచ్చనే అంచనాలు అభిమానుల్లో మొదలయ్యాయి. వాస్తవిక కోణంలో దానికి ఛాన్స్ లేదని చెప్పాలి. ఎందుకో చూద్దాం. పుష్ప 2 ది రూల్ ఆగస్ట్ లో రిలీజయ్యాక అల్లు అర్జున్ లిస్టులో అట్లీ, త్రివిక్రమ్ శ్రీనివాస్, సందీప్ రెడ్డి వంగా ఉన్నారు. వీళ్ళలో ఎవరిది ముందు ఉంటుందో ఇంకా స్పష్టత లేదు. పుష్ప 3 గురించి ప్రచారాన్ని టీమ్ కొట్టిపారేయడం లేదు కనక థర్డ్ పార్ట్ వచ్చే అవకాశం లేకపోలేదు. ఎలా చూసుకున్నా అల్లు అర్జున్ ఇంకో నాలుగేళ్లు బిజీనే. మరి ఆర్య 3 ఆ తర్వాత చేయాలంటే బాగా ఆలస్యమవుతుంది. ఆమాంతం పెరిగిన ప్యాన్ ఇండియా ఇమేజ్ ముందు ఆర్య లాంటి లవర్ బాయ్ పాత్రలు బన్నీకి ఇప్పుడంతగా నప్పవు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com